సాక్షి
రాజన్న సిరిసిల్ల
శుక్రవారం । 12 । జనవరి । 2024



డైరీ ఆవిష్కరణ
సిరిసిల్లటౌన్: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం డైరీని గురువారం ఆవిష్కరించారు.



క్రీడాకారులకు టీషర్టులు
సిరిసిల్లటౌన్: కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న క్రీడాకారులకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జిందం చక్ర పాణి టీషర్టులు పంపిణీ చేశారు.

గరిష్టం/కనిష్టం
31.0/19.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి
- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రోగులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని ఏరియా ఆస్పత్రిని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గురువారం సందర్శించారు. ఆస్పత్రిలోని ప్రతీ వార్డును తిరిగి రోగులకు అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని రోగులతో మాట్లాడారు. ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.10లక్షల వరకు పెంచమని గుర్తుచేశారు. ఆస్పత్రిలో వైద్యసేవలు అందించడంలో వైద్యులు ముఖ్యపాత్ర పోషించాలన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రేగులపాటి మహేశ్ రావు, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్, సాగరం వెంకటస్వామి, కనికరపు రాకేశ్, నాగుల విష్ణు తదితరులు ఉన్నారు.

చైనా మాంజా నిషేధం
- ఎస్పీ అఖిల్ మహాజన్



సిరిసిల్లక్రైం: సంక్రాంతి పండుగ సందర్భంగా గాలిపటాలను ఎగురవేయడానికి వినియోగించే చైనా దారం(మాంజా) నిషేధమని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. మాంజా దారంలో ఉన్న నైలాన్, సింథటిక్ దారాలతో పక్షులకు, పర్యావరణానికి కొన్నిసార్లు మనుషులకు ప్రాణహాని కలుగుతుందన్నారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో చైనా మాంజా నిషేధమని స్పష్టం చేశారు.


ప్లాస్టిక్ రహిత పట్టణంగా సిరిసిల్ల



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిషనర్ అయాజ్

సిరిసిల్లటౌన్: ప్రజల భాగస్వామ్యంతో ప్లాస్టిక్ రహితంగా సిరిసిల్ల పట్టణం వెలుగొందుతుందని మున్సిపల్ కమిషనర్ అయాజ్ పేర్కొన్నారు. ప్లాస్టిక్ నిషేధాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. భారత పర్యావరణ అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీ పర్యవేక్షణలో నెహ్రూనగర్ పాఠశాలలో ఎన్‌జీసీ ఏకో క్లబ్ పాఠశాలల విద్యార్థులకు ఒక్కరోజు వర్క్‌షాప్‌లో పాల్గొని మాట్లాడారు. ప్లాస్టిక్ వేస్టేజ్‌తో భూమి, నీరు, గాలి కలుషితమయ్యే తీరును వివరించారు. సిరిసిల్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలు.. తడి, పొడి, చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్న విధానాలను విద్యార్థులకు అవగాహన కల్పించారు. డీఈవో రమేశ్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, ఈఈ రఘు, ఎన్‌జీసీ కోఆర్డినేటర్ విద్యాసాగర్, హెచ్‌ఎం భాగ్యరేఖ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల జీతాలివ్వాలి



మాట్లాడుతున్న కదారి రాములు

సిరిసిల్లటౌన్: పది నెలలుగా పెండింగ్‌లో ఉంటున్న మున్సిపల్ కార్మికులు జీతాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కదారి రాములు కోరారు. సిరిసిల్లలోని కార్మిక భవనంలో గురువారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. 11వ పీఆర్సీ ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అందించాలని, లేకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అజ్జ వేణు, నల్ల చంద్రమౌళి, పంతం రవి తదితరులు పాల్గొన్నారు.

14న సంక్రాంతి సంబరాల కవి సమ్మేళనం
సిరిసిల్ల: సిరిసిల్ల వస్త్రవ్యాపార సంఘ భవనంలో ఈనెల 14న సంక్రాంతి సంబరాల కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ జనపాల శంకరయ్య, ప్రధాన కార్యదర్శి వెంగళ లక్ష్మణ్ గురువారం తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని, ఆసక్తి గల వారు రావాలని కోరారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా శుక్రవారం ఉదయం 11 గంటలకు గాంధీచౌక్‌లో వేడుకలు నిర్వహిస్తామని శంకరయ్య, లక్ష్మణ్ తెలిపారు. జిల్లాలోని కవి, రచయితల జయంతి వేడుకలకు హాజరుకావాలని కోరారు.

వరద ముప్పు తప్పేనా !

- నిలిచిన వరద మళ్లింపు పనులు
- చినుకుపడితే సిరిసిల్ల వణుకే..
- అసంపూర్తిగా రూ.6.21కోట్ల పనులు
- మరో రూ.15 కోట్ల పనులకు బ్రేక్



ఇది జిల్లా కేంద్రంలోని కొత్తచెరువు కట్ట కింద మూడేళ్ల క్రితం తవ్విన కచ్చా కాల్వ. ఈ కాల్వతోనే రెండేళ్లుగా శ్రీనగర్‌కాలనీ పెద్దగా ముంపునకు గురికాకుండా ఎప్పటికప్పుడు చెరువు మత్తడినీరు మానేరువాగులోకి చేరుతుంది. గతంలో ఈ కాల్వ లేక శ్రీనగర్ కాలనీ జలమయమైంది. 2023 అక్టోబర్ 8న రూ.15కోట్లను అండర్ డ్రెయినేజీ కాల్వ నిర్మాణానికి జీవో ఆర్‌టీ నంబరు 841 ద్వారా మంజూరు చేశారు. లైన్ ఎస్టిమేట్ పూర్తయింది. కానీ ఎన్నికల కోడ్ రావడంతో పని ప్రారంభం కాలేదు. ఇప్పుడు వర్క్ ఆర్డర్ లేని పనులు చేయొద్దని ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలతో రూ.15కోట్ల పనులపై సందిగ్ధం నెలకొంది.



ఇది జిల్లా కేంద్రంలోని పద్మనగర్–అనంత్‌నగర్ మధ్య ప్రధాన మురికికాల్వపై 2017లో అప్పటి మున్సిపల్ అధికారులు, ఇంజినీర్ల అనాలోచిత నిర్ణయంతో నిర్మించిన మురికినీటి శుద్ధి ప్లాంటు. మురికికాల్వ నీటిని శుద్ధి చేసి కొత్తచెరువులోకి మళ్లించాలని దీన్ని రూ.3కోట్లతో నిర్మించారు. కానీ నిర్మాణలోపంతో ఇక్కడి నుంచి మురికినీరంతా అనంత్‌నగర్, సర్దార్‌నగర్, సంజీవయ్యనగర్, పాతబస్టాండు ప్రాంతాలను ముంచెత్తింది. మరోవైపు చిన్నపాటి వర్షాలకే ఊరు వరదనీటితో మునిగిపోయేందుకు ఈ ప్లాంటు కారణమైంది. చుక్క మురికినీటిని శుద్ధి చేయకుండానే రూ.3కోట్ల ప్రజాధనాన్ని కాల్వపాలు చేశారు.



ఇది సంజీవయ్యనగర్ వెళ్లే వీధి. చిన్నపాటి వర్షం పడితే చాలు వరద ఇలా నిలుస్తుంది. ఆ వీధిలోకి వాహనాల రాకపోకలకు అడ్డంకిగా మారుతుంది. పాతబస్టాండ సమీపంలో జనరద్దీ ఉండే ప్రాంతం కావడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.



ఇది సిరిసిల్ల వెంకంపేటలోని ప్రధాన డ్రెయినేజీ. ఈ కాల్వను ఆధునీకరించేందుకు రూ.6.21కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో తొలుత స్థానిక కాంట్రాక్టర్ పనులు చేయగా... కాల్వ వెంట ఉన్న ఆక్రమణల తొలగింపు, డ్రెయినేజీ నిర్మాణ పనులు చేయాల్సి ఉంది. కొంతమేరకు పనులు చేసిన కాంట్రాక్టర్ మధ్యలో వదిలేశాడు. థర్డ్ పార్టీ టెండర్లు పిలిచి హైదరాబాద్ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. సదరు కాంట్రాక్టర్ సైతం పనులను మధ్యలోనే వదిలేసి వెళ్లారు. ఇంకా వంద మీటర్ల కాల్వ పని, మరో రెండు కల్వర్టులు నిర్మించాల్సి ఉంది.

సిరిసిల్ల: సిరిసిల్ల పట్టణానికి వరదముప్పు తప్పించేందుకు మున్సిపల్ అధికారులు ఏటా విఫలమవుతూనే ఉన్నారు. గత నాలుగేళ్లుగా వరుసగా ఏటా వర్షాకాలంలో సిరిసిల్ల పట్టణం వరద ముంపునకు గురవుతూనే ఉంది. శాశ్వత పరిష్కారం కోసం చేపట్టిన పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. వాటిపై పర్యవేక్షణ లేకపోవడంతో పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. రానున్న వర్షాకాలం వరకు అయినా వరద మళ్లించే పనులు పూర్తవుతాయా?లేదా? అనే అనుమానాలు కలుగుతున్నాయి.

చెరువుల పూడ్చివేతతో సమస్య ఉత్పన్నం

సిరిసిల్ల పట్టణంలోని రాయిని చెరువును పూర్తిగా పూడ్చివేసి బీవై నగర్, గణేశ్‌నగర్, సుందరయ్యనగర్, తారకరామానగర్, ఇందిరానగర్ కాలనీలుగా అవతరించాయి. ప్రస్తుతం కొత్తచెరువును సుందరీకరణ పేరుతో శిఖం ప్రాంతాన్ని పూడ్చివేసి ఉద్యానవనం ఏర్పాటు చేశారు. దీంతో కొత్తచెరువు నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. సిరిసిల్ల పట్టణ నడిబొడ్డులోని ఉదారువాగు కబ్జాకు గురైంది. ఇలా పట్టణంలో పాలకుల నిర్లక్ష్యంతో వరద సమస్య తీవ్రమైంది. మరోవైపు మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ ఇంజినీరింగ్ శాఖల మధ్య సమన్వయ లోపంతో ఎవరికి వారు పనులు చేసుకుంటూ వెళ్లడంతో వరదనీటి ప్రవాహం.. దాని ప్రభావంపై ఎవరికీ పట్టింపులేక సిరిసిల్లలో వరద సమస్య జఠిలమవుతోంది.

ఇవీ చేస్తేనే సమస్యకు పరిష్కారం

- కొత్త చెరువు మత్తడి దూకితే వచ్చే వరదనీరు శ్రీనగర్‌కాలనీని ముంచెత్తకుండా కచ్చా కాల్వను బైపాస్‌రోడ్డు వరకు కొనసాగించాలి. అప్పుడు వరద తుమ్మలకుంటలోకి వెళ్తుంది.
- రాజీవ్‌నగర్, ముష్టిపల్లి నుంచి వచ్చే వరదనీటిని కొత్త చెరువులోకి నేరుగా చేరేలా రూ.6.21కోట్లతో చేపట్టిన పనులు పూర్తి చేయాలి. పెండింగ్ పనులు పూర్తి చేస్తేనే పట్టణంలోకి వెళ్లకుండా చెరువుకు వరద నీరు చేరుతుంది.
- మురికినీటి శుద్ధికోసం వెంకంపేట–అనంత్‌నగర్ మధ్య కాల్వపై నిర్మించిన ఈటీపీ ప్లాంటును పూర్తిగా తొలగించి నేరుగా నీరు వెళ్లేలా పనులు చేయాలి.
- సిరిసిల్ల సాయినగర్ నుంచి శాంతినగర్ వరకు ఉన్న ప్రధాన మురికి కాల్వలో పేరుకున్న పూడికను తొలగించాలి. వర్షాలు పడితే.. మురికి నీరు రోడ్డెక్కక కుండా.. పూడిక తొలగించాలి. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఈ పనులు పూర్తయితేనే వర్షాకాలంలో వరద ముప్పు కొంతైనా తప్పుతుంది.

వరద ముప్పు లేకుండా పనులు



సిరిసిల్ల పట్టణంలో వరదముప్పు లేకుండా పనులు చేపట్టాం. కానీ కాంట్రాక్టర్లు పనులు మధ్యలో వదిలేశారు. మళ్లీ కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు జరిగేలా చూస్తాం. వెంకంపేట కాల్వ పనులు, కల్వర్టుల నిర్మాణాలు పూర్తి చేయిస్తాం. శ్రీనగర్‌కాలనీలో కచ్చా కాల్వను పూర్తి చేస్తాం. వరద నివారణ పనులను పూర్తి చేసి వరద సమస్య పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

– జిందం కళాచక్రపాణి, మున్సిపల్ చైర్‌పర్సన్, సిరిసిల్ల

నారాయణపూర్ వాసికి అరుదైన అవకాశం
- సీఎం పీఆర్వోగా సీనియర్ జర్నలిస్టు
- స్వగ్రామంలో సంబరాలు



బొల్గం శ్రీనివాస్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన సీనియర్ జర్నలిస్టు బొల్గం శ్రీనివాస్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పీఆర్వోగా నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాస్ తండ్రి వెంకటయ్య ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడిగా పదవీ విరమణ పొందారు. పీజీ వరకు విద్యాభ్యాసం చేసిన శ్రీనివాస్ మొదట ఈనాడు దినపత్రికలో కంట్రిబ్యూటర్‌గా పత్రిక రంగంలో ప్రస్థానం ప్రారంభించారు. అనంతరం సాక్షి దినపత్రికలో బ్యూరో ఇన్‌చార్జిగా, జనరల్ బ్యూరోగా పనిచేశారు. ప్రస్తుతం వీ6–వెలుగు దినపత్రికలో బ్యూరో చీఫ్‌గా పనిచేస్తున్నారు. ఈక్రమంలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి పీఆర్వోగా నియమితులయ్యారు. చిన్నతనం నుంచి సాహిత్యం, జర్నలిజంపై మక్కువ చూపేవారు. చదువుల తల్లి నారాయణపూర్‌లో ఇప్పటికే అటెండర్ నుంచి ఐఏఎస్ వరకు అధికారులు ఉండగా, ఈ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌కు సీఎం పీఆర్వోగా అరుదైన అవకాశం రావడంతో గ్రామస్తులు సంబరాలు చేసున్నారు. శ్రీనివాస్ నియామకంపై గ్రామస్తులతో పాటు అతని స్నేహితులు, అధికారులు, వివిధ పార్టీల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి కథల పోటీలకు జిల్లెల్ల విద్యార్థిని



అక్షితను సన్మానిస్తున్న జిల్లెల్ల ఉపాధ్యాయులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని జిల్లెల్ల ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని చెల్లం అక్షిత రాసిన కథ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం అనురాధ తెలిపారు. మాచిరాజు బాలసాహిత్య పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన కథల పోటీలలో అక్షిత తన నానమ్మ చిన్నతనం స్ఫూర్తిగా «చిన్ననాటి జ్ఞాపకాలు» కథ రాసింది. త్వరలో అక్షితను రవీంద్రభారతీలో సన్మానిస్తారని తెలిపారు.

చిరుతలు సైలెంట్

- జిల్లాలో రెండు నెలలుగా స్తబ్దత
- ఇతర ప్రాంతాలకు వెళ్లినట్లు అనుమానాలు
- అడవిలో దొరుకుతున్న ఆహారం
- పశువులపై తగ్గిన దాడులు
- జిల్లాలో చివరి సంచారం బాబాయ్ చెరువుతండాలో..
- స్వేచ్ఛగా పొలాలకు వెళ్తున్న రైతులు



చిరుతల పాదముద్రలు



ఇతను ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌కు చెందిన రైతు మట్ట సత్తిరెడ్డి. ఇతనికి గ్రామ శివారులోని దట్టమైన అటవీని ఆనుకుని వ్యవసాయ భూములు ఉన్నాయి. మొన్నటి వరకు పంటలను చూసుకునేందుకు వెళ్దామన్న చిరుతల సంచారంతో భయం..భయంగా ఉండేవారు. రెండు నెలలుగా చిరుతల సంచారం తగ్గడంతో నిర్భయంగా పొలం వద్దకు రాత్రి, పగలు తేడా లేకుండా వెళ్లి పంటను చూసుకుంటున్నాడు. ఇలాంటి పరిస్థితి జిల్లాలోని అటవీని ఆనుకున్న ఉన్న గ్రామాల రైతులు మొన్నటి వరకు ఎదుర్కొన్నారు. రెండు నెలలుగా ప్రశాంతంగా పొలాల వద్దకు వెళ్లి పనులు చేసుకుంటున్నారు.



వీళ్లు ఎల్లారెడ్డిపేట మండలంలోని గుంటపల్లి చెరువుతండాకు చెందిన రైతులు. గత రెండు నెలల క్రితం చిరుతల భయంతో పంటలను కాపాడుకునేందుకు వారంతా గుంపులుగా వెళ్లేవారు. రక్షణకు చేతుల్లో కర్రలు పట్టుకొని వెళ్లేవారు. గతంలో అనేక సార్లు చిరుతలు గిరిజన రైతులపై దాడికి ప్రయత్నించాయి. వాటి నుంచి తప్పించుకొని పనులు చేసుకుంటూ కాలం వెళ్లదీశారు. నాట్లు వేసే సమయంలో మహిళలు పనులు చేస్తుంటే పురుషులు కాపలా కాసేవారు. నేడు చిరుతల సంచార లేకపోవడంతో ఒంటరిగా పొలాల వద్దకు వెళ్తున్నారు. ఇప్పుడిప్పుడే గిరిజనతండాలు చిరుతల భయం నుంచి బయటపడుతున్నాయి.

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లా ప్రజలకు మొన్నటి వరకు కంటిమీద కునుకు లేకుండా చేసిన చిరుతలు ఇప్పుడు సైలెంట్ అయ్యాయి. గత రెండు నెలలుగా జిల్లాలో వాటి సంచారమే లేదు. నిత్యం చిరుతల దాడుల నుంచి కాపాడుకునేందుకు గిరిజన రైతులు, పశువుల కాపరులు చేతుల్లో కర్రలతో కనిపించేవారు. నేడు ఆ దృశ్యాలు మాయమయ్యాయి. గిరిజన రైతులు, పశువుల కాపరులు ప్రశాంతంగా అటవీకి వెళ్లి వారి పనులు చేసుకుంటున్నారు. చిరుతలు ఒకే ప్రాంతంలో ఉండవని, నిత్యం 40 కిలోమీటర్ల పరిధిలో సంచరిస్తుంటాయని అటవీశాఖ అధికారులు తెలుపుతున్నారు. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి ఉండవచ్చని అభిప్రాయపడుతున్నారు.

జిల్లాలో ఏడు చిరుతలు

జిల్లాలో మొత్తం ఏడు చిరుతలు సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఈ చిరుతలు ఇప్పుడు నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, కరీంనగర్, గోదావరి ప్రాంతాలకు వెళ్లి ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతోనే గత రెండు నెలలుగా జిల్లాలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకపోవడం దీనికి బలాన్ని చేకూరుస్తోంది. దట్టమైన అడవుల్లో ఎత్తయిన చెట్లు, గుట్టలపైనే ఆవాసాలను ఏర్పాటు చేసుకుంటాయి. కొంతకాలం పాటు రేంజ్(క్షేత్రాన్ని) ఏర్పాటు చేసుకొని పొద్దంతా సుమారు 40 కిలోమీటర్ల పరిధిలో సంచరించి మళ్లీ అదే ప్రాంతానికి వస్తాయని అట వీశాఖ అధికారులు చెబుతున్నారు. అడవి పచ్చగా ఉండడం, ఇతర జంతువులు జింకలు, కుందేళ్లు, కొండగొర్రె, మనుబోతు, మెఖం, దుప్పులు పెరగడంతో.. వాటినే వేటాడి తింటుండవచ్చని పేర్కొంటున్నారు. దీంతోనే గ్రామ శివారులోని పశువులపై దాడులు చేయడం లేదని వారు అభిప్రాయపడుతున్నారు.

చివరి సంచారం బాబాయ్‌చెరువుతండాలో..

రెండు నెలల క్రితం వీర్నపల్లి మండలం బాబాయ్‌చెరువు, మద్దిమల్ల తండాల్లోని ఐదు లేగ దూడలపై దాడి చేశాయి. అప్పటి నుంచి చిరుతల దాడులు తగ్గిపోయాయి. రెండు నెలల క్రితం చిరుతలు వరుసగా ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లి, కోనరావుపేట మండలం ధర్మారం, కోనరావుపేట, సిరిసిల్ల శివారులోని చిన్నబోనాల, ఇల్లంతకుంట మండలం అనంతగిరి ప్రాజెక్టు, చిన్న లింగాపూర్‌లో చిరుతలు సంచరించిన ఆనవాళ్లు ఉన్నాయి. చిరుతల సంచారం లేకపోవడంతో ఇటు అధికారులు అటు రైతులు, పశువుల కాపరులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

ఇప్పుడు భయం లేదు



ఒకప్పుడు పొలాల కాడికి పోవాలంటే భయపడేటోళ్లం. రెండు నెలలుగా చిరుతలు కనిపిస్తలేవు. భయం లేకుండా అడవికి, పొలాల కాడికి పోతున్నం. మళ్లీ చిరుతలు మా తండాల వైపు రాకుండా అధికారులు ఏమైన చర్యలు తీసుకుంటే మా కష్టాలు తప్పుతాయి. అధికారులు ఆలోచించాలి.

– మాలోత్ పుణ్యానాయక్, గుంటపల్లిచెరువు తండా

సంచారం లేదు



జిల్లాలో రెండు నెలలుగా చిరుతల సంచారం లేదు. రైతులు, పశువుల కాపరులు స్వేచ్ఛగా తమ పనులు చేసుకుంటున్నారు. చిరుతలు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలస వెళ్తుంటాయి. ప్రధానంగా నీటివసతి, మాంసాహార జంతువులు సంచరించే ప్రాంతాల్లో మకాం వేస్తుంటాయి. అయినా అటవీ సమీప గ్రామాల రైతులు జాగ్రత్తగా ఉండాలి.

– బాపిరాజు, అటవీశాఖ సెక్షన్ అధికారి

జిల్లాలో అభివృద్ధిని ఆవిష్కరించండి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

- నేడు జిల్లాలో కేంద్ర బృందం పర్యటన
- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో జరిగిన అభివృద్ధి పనులను ఆవిష్కరించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర టెక్స్‌టైల్ మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి, వికసిత్ సంకల్పయాత్ర జిల్లా నోడల్ అధికారి అజయ్‌గుప్తా ఆధ్వర్యంలోని కేంద్ర బృందం శుక్రవారం పర్యటిస్తుందని తెలిపారు. కోనరావుపేట మండలం మల్కపేట, బోయినపల్లి మండలం అనంతపల్లి గ్రామాల్లో వికసిత సంకల్పయాత్రను పరిశీలిస్తుందని, ఈమేరకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో చేపట్టిన పనులు వివరించాలని, విజయగాథలు తెలిపేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, డీఆర్‌డీవో ఎన్.శ్రీనివాస్, డీపీవో రవీందర్, డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్, జిల్లా ఉద్యానవన అధికారి జ్యోతి, జిల్లా మిషన్ భగీరథ ఈఈ జానకి, జౌళి శాఖ ఏడీ సాగర్, జిల్లా మత్స్యశాఖ అధికారి శివప్రసాద్, డీఆర్‌డీఏ ఏపీడీ మదన్‌మోహన్ ఉన్నారు.

భక్తుల సౌకర్యాలపై దృష్టి పెట్టండి

- ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్
- ఆలయ అధికారులతో ప్రత్యేక సమావేశం



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: రాజన్నను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఆలయ అధికారులు పకడ్బందీగా పనిచేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సూచించారు. సమ్మక్క జాతర భక్తుల రద్దీతోపాటు మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై సమీక్షించుకోవాలని తెలిపారు. చైర్మన్ చాంబర్‌లో గురువారం ఆలయ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ఆది, సోమ, శుక్రవారాల్లో పకడ్బందీగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఏఈవోలు హరికిషన్, ప్రతాప నవీన్, బి.శ్రీనివాస్, జయకుమారి, ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్, ఏఈ శేఖర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయ సాహస శిక్షణ శిబిరానికి ఎంపిక



భవానిని సన్మానిస్తున్న అధ్యాపకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని కాసారపు భవాని జాతీయ సాహస శిక్షణ శిబిరానికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె.రజనీ తెలిపారు. ఎస్ఎస్ఎస్ వాలంటీర్ కాసారపు భవానిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. భవానిని వైస్‌ప్రిన్సిపాల్ సుధాసింధు, ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.వాణిశ్రీ, అధ్యాపక బృందం అభినందించారు.

భరోసాలో తాత్కాలిక ఉద్యోగాలు

సిరిసిల్లక్రైం: జిల్లాలో కొత్తగా ఏర్పాటు కాబోతున్న భరోసా సెంటర్‌లో తాత్కాలిక ప్రాతిపదికన ఉద్యోగాల ఎంపికకు ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. కౌన్సిలర్ కం సెంటర్ కోఆర్డినేటర్ 1, లీగల్ సపోర్టింగ్ పర్సన్ 1, సపోర్టు పర్సన్ 2, రిసెప్షనిస్ట్ 1, ఏఎస్ఎం 1 పోస్టు ఉన్నట్లు వివరించారు. ఈ ఉద్యోగాలకు మహిళలు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఏడాదిపాటు ఈ నియామకాలు ఉంటాయని, అవసరం, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో కొనసాగింపు ఉండవచ్చని పేర్కొన్నారు. వివరాలకు అధికారిక వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

చెట్టును నరికిన వ్యక్తికి రూ.10వేల జరిమానా



జీపీ అధికారికి జరిమానా చెల్లిస్తున్న రఫీక్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలో 15 రోజుల క్రితం ఓ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి చెట్టును నరికివేసిన సంఘటనలో సదరు వ్యక్తికి గ్రామ పంచాయతీ అధికారులు గురువారం రూ.10వేల జరిమానా విధించారు. ఎల్లారెడ్డిపేటకు చెందిన హరిత ప్రేమికుడు దుంపెన రమేశ్ తన ఇంట్లో చెట్లను పెంచుతున్నాడు. రమేశ్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో వీర్నపల్లి మండలం మద్దిమల్లకు రెందిన రఫీక్ అక్రమంగా చొరబడి చెట్టును నరికివేశాడు. దీంతో రమేశ్ గ్రామపంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. రమేశ్ ఫిర్యాదుతో విచారణ చేసిన అధికారులు రూ.10వేల జరిమానా విధించారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



వేములవాడరూరల్: వేములవాడ మున్సిపల్ పరిధిలోని కోనాయపల్లి శివారులో గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందినట్లు వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. మృతుని వయస్సు 50 ఏళ్లకు పైగా ఉంటుందని, ఫొటో ఆధారంగా గుర్తిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్, లేదా 87126 56413లో సమాచారం ఇవ్వాలని సూచించారు.

సురక్షిత డ్రైవింగ్‌తో మెరుగైన ఉపాధి

- మండేపల్లిలో ఇంటిగ్రేటెడ్ డ్రైవింగ్ స్కూల్
- పురుషులతోపాటు మహిళలకు ప్రత్యేక శిక్షణ
- శిక్షణ పూర్తికాగానే ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న డీటీవో కొండల్‌రావు



కంప్యూటర్ ద్వారా డ్రైవింగ్ శిక్షణ



డ్రైవింగ్ స్కూల్‌ను సందర్శించిన జర్నలిస్టులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): సురక్షిత డ్రైవింగ్‌తో మెరుగైన ఉపాధి లభిస్తుందని, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు దీటుగా రూ.లక్షల్లో సంపాదించవచ్చని టైడ్స్(తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్), ఐటీడీఆర్ ప్రిన్సిపాల్ కేబీ రాఘవన్ తెలిపారు. ఐటీడీఆర్‌లో శిక్షణ పొందిన వారికి అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలు లభిస్తున్నట్లు పేర్కొన్నారు. జనవరి 11 నుంచి 17 వరకు రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి మామిండ్ల దశరథం ఆధ్వర్యంలో గురువారం జిల్లా పాత్రికేయుల బృందాన్ని మండేపల్లి ఐటీడీఆర్‌కు ఆహ్వానించి ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.

శిక్షణ లేని డ్రైవర్ ఉన్మాదితో సమానం

సరైన శిక్షణ, రోడ్డు నిబంధనలు తెలియని డ్రైవర్ ఉన్మాదితో సమానమని నిపుణులు చెబుతున్నారు. అవగాహన లేకుండా డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలు జరిగి తన ప్రాణాలు పోవడమేకాకుండా అమాయకమైన ఇతర వాహనదారుల ప్రాణాలను కూడా తీస్తాడని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశంలో ఏటా 4.60 లక్షల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అందులో 1.60 లక్షల మంది ప్రాణాలు కోల్పోతుండగా.. 3 లక్షల మంది వైకల్యం బారిన పడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

అనువైన ప్రాంతంలో అధునాతన శిక్షణ

రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండేపల్లిలో 21 ఎకరాల్లో రూ.20కోట్లకుపైగా నిధులతో ఏర్పాటు చేసిన విశాలమైన భవనాలు, అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన రోడ్లు, శిక్షణ పొందే డ్రైవర్లకు హాస్టల్, క్యాంటీన్ సదుపాయాలు ఉన్నాయి. ఒకేసారి 120 మందికి శిక్షణ ఇచ్చేలా సదుపాయాలు, డ్రైవింగ్ ఫ్యాకల్టీ ఉన్నారు. ఇప్పటికే 30 బ్యాచ్‌లు నిర్వహించగా సుమారు వెయ్యి మంది డ్రైవింగ్ శిక్షణ పొందారు. వారిలో 300 మంది విదేశాల్లో డ్రైవర్లుగా ఉద్యోగాలు సాధించి మంచి వేతనంతో స్థిరపడ్డారు. మిగిలిన వారు మన దేశంలోనే వివిధ ప్రాంతాల్లో డ్రైవర్లుగా నియమితులయ్యారు.

కోర్సు, అర్హత, శిక్షణ

మండేపల్లి ఇంటిగ్రేటెడ్ డ్రైవింగ్ స్కూల్‌లో ప్రస్తుతం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. – లైట్ మోటార్ వెహికల్ (ఎల్ఎంవీ) : 21 రోజులు, 18 ఏళ్లు ఆపైన (ఆడవారికి ప్రత్యేక బ్యాచ్), కోర్సు ఫీజు రూ.7,080, హాస్టల్ ఫీజు రోజుకు రూ.250

- హెవీ మోటార్ వెహికల్(హెచ్ఎంవీ) : 30 రోజులు, వయసు 20 ఏళ్లు ఆపై.. ఎల్ఎంవీ లైసెన్స్ కలిగి ఉండాలి, కోర్సు ఫీజు రూ.16,250, హాస్టల్ ఫీజు రోజుకు రూ.250.
- ప్రమాదకర వస్తువులు(హజార్డ్స్), పెట్రోలియం ఉత్పత్తులు గ్యాస్, ఆసిడ్స్, పేలుడు పదార్థాలకు సంబంధించి 3 రోజుల శిక్షణ ఇస్తారు. హెచ్ఎంవీ, టీవీఈహెచ్ లైసెన్స్ కలిగి ఉండాలి. కోర్సు ఫీజు రూ.2,250, హాస్టల్ ఫీజు రోజుకు రూ.250.
- ప్రమాదకర వస్తువుల రవాణాలో శిక్షణ (హజార్డ్స్ రెన్యూవల్ అండ్ హెచ్ఎంవీ లైసెన్స్ రెన్యూవల్) : ఒక్క రోజు శిక్షణ ఇస్తారు, హెచ్ఎంవీ, హెచ్‌జీవీ లైసెన్స్ కలిగి ప్రమాదకర వస్తువుల రవాణా ఎండార్స్‌మెంట్ ఉండాలి. ఫీజు రూ.750 ఉంటుంది.

మహిళలకు ప్రత్యేక బ్యాచ్‌లు



ఇంటిగ్రేటెడ్ డ్రైవింగ్ స్కూల్‌లో మహిళలకు కూడా డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నాం. మహిళలకు ప్రత్యేక బ్యాచ్ ఏర్పాటు చేసి ప్రత్యేకంగా శిక్షణ అందిస్తాం. ఇప్పటికే ముగ్గురు మహిళలు శిక్షణ పొందారు. మహిళలను డే స్కాలర్‌గా తీసుకుంటాం. వారికి హాస్టల్ వసతి లేదు. – శిరీష, కంప్యూటర్ నిపుణురాలు, ఐటీడీఆర్

మెరుగైన శిక్షణ అందిస్తున్నాం



సీఎంవీఆర్ (సెంట్రల్ మోటార్ వెహికల్ రెగ్యులేషన్) ప్రకారం మెరుగైన శిక్షణ ఇస్తున్నాం. శిక్షణ ఇచ్చేందుకు అత్యుత్తమ శిక్షకులు అందుబాటులో ఉన్నారు. డ్రైవింగ్‌తోపాటు థియరీ క్లాసులు కూడా నిర్వహించి ఉత్తమంగా తీర్చిదిద్దుతాం. – విజయ్ ఎంద్ర, డ్రైవింగ్ శిక్షకుడు ఐటీడీఆర్

అడ్మిషన్లు జరుగుతున్నాయి



ఐటీడీఆర్‌లో మెరుగైన పరికరాలు, లక్షల రూపాయల విలువైన డ్రైవింగ్ స్టిమ్యులేటర్లు ఉన్నాయి. మంచి భోజనం, హాస్టల్, అత్యుత్తమ శిక్షకులు ఉన్నారు. శిక్షణ అనంతరం మెరుగైన ఉపాధి పొందవచ్చు. ఇప్పటికే శిక్షణ పొందినవారు రూ.లక్షల్లో జీతాలు పొందుతున్నారు. ప్రస్తుతం అడ్మిషన్లు జరుగుతున్నాయి. – కే.బి.రాఘవన్, ప్రిన్సిపాల్ టైడ్స్ ఐటీడీఆర్

యువత వివేకానందుని స్ఫూర్తితో ముందుకెళ్లాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



బహుమతులు అందిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడఅర్బన్: యువత వివేకానందుని స్ఫూర్తితో ముందుకెళ్లాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. వేములవాడ మండలం అగ్రహారంలోని శ్రీ కన్వెన్షన్‌లో నరేన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన యువజన దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. స్వామి వివేకానంద యువతకు తన ప్రసంగాల ద్వారా ఎంతో స్ఫూర్తి నింపారన్నారు. విద్యార్థులు విద్యలో రాణించి భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో ఉండాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో వివిధ విద్యాసంస్థలకు చెందిన 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సామాజిక వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్, నరేన్ ఫౌండేషన్ నిర్వాహకుడు సురేంద్రబాబు, కథా రచయిత పెద్దింటి అశోక్‌కుమార్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

వాయిదాల ప్రకారం రుణాలు చెల్లించాలి

- ఐకేపీ డీపీఎం పద్మయ్య



మాట్లాడుతున్న డీపీఎం పద్మయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లాలోని అన్ని గ్రామాల స్వయం సహాయక సంఘాల సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని, బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి రుణాలు తీసుకున్న మహిళలు వాయిదాల ప్రకారం రుణాలు చెల్లించాలని ఐకేపీ డీపీఎం పద్మయ్య పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలోని సెర్ప్ ఆధ్వర్యంలో కావేరి మండల సమాఖ్య సమావేశం గురువారం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ లావాదేవీల పుస్తకాలు సక్రమంగా రాయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. ఏపీఎం మల్లేశం, మండల సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, జిల్లా ఏపీఎం రాజేశం, సీసీలు, స్త్రీనిధి ఆర్ఎం రాంనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ బాబు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

చిరుత సంచారంపై అటవీ అధికారుల అలర్ట్



చిరుత సంచరించిన ప్రాంతంలో ఫ్లెక్సీ



చిరుత పాదముద్రలను పరిశీలిస్తున్న అధికారులు

- సత్తక్కపల్లి శివారులో రోజంతా గస్తీ
- సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లి శివారులో చిరుత సంచారంపై ఎట్టకేలకు అటవీశాఖ అధికారులు అప్రమత్తయ్యారు. గ్రామ శివారులో చిరుత సంచరిస్తున్న చోట, వరదకాల్వ వైపు, ఇతర ప్రాంతాల్లో గురువారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు గాలింపు చేపట్టారు. రోజంతా అక్కడే ఉన్న అధికారులు చిరుతపులి ఎక్కడి నుంచి ఏ దారిలో వెళ్తుందోనని పాదముద్రల ఆధారంగా అంచనాకు వచ్చారు. ఉసికెగుట్ట నుంచి మధ్యలో ఉన్న పంటపొలాల మీదుగా వరదకాల్వ వైపు ఒకే దారిలో నడిచినట్లు గుర్తించారు. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. పెద్దపల్లి జిల్లా మంథని అటవీ కార్యాలయం నుంచి నాలుగు కెమెరాలు తీసుకువచ్చి అనుమానిత ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. కిలోమీటర్‌లోపు 200 మీటర్ల దూరం మధ్య మొత్తం 4 నాలుగు కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కాగా ఓ గొర్రెల కాపరి చిరుత కనిపించందని చెప్పడంతో ఆచోట పాదముద్రలను పరిశీలించారు. మరోవైపు చిరుత సంచరించిన ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా హెచ్చరిక ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మెట్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ షౌకత్ అలీ, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ హఫీజొద్దీన్, బీట్ ఆఫీసర్లు శివరాజ్, రత్నాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నక్సలైట్లమని బెదిరించిన ముగ్గురి రిమాండ్

వేములవాడ: వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాలరామన్నపల్లికి చెందిన భూవివాదంలో నక్సలైట్లమని బెదిరించిన మానుక కుంటయ్య, పట్టెం మల్లేశం, బొలుగం మల్లేశంలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ కరుణాకర్ గురువారం తెలిపారు. నాంపల్లి శివారులోని ఫిర్యాదుదారుడి భూమిలో తమకు సగం భూమి రిజిస్ట్రేషన్ చేయాలని, లేకుంటే చంపేస్తామంటూ బెదిరించినట్లు సీఐ తెలిపారు. అంతేకాకుండా ఫిర్యాదుదారుడి భూమిని చదును చేసి ఆక్రమించుకున్నారన్నారు. ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.

వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య



సయ్యద్ నాజీ (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): వరకట్న వేధింపులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. కోనరావుపేట మండలం బావుసాయిపేటకు చెందిన సయ్యద్ అస్లాంకు, వేములవాడ మండలం తుర్కాశీనగర్‌కు చెందిన నాజీ(21)తో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. వీరికి మూడు నెలల క్రితం ఓ పాప జన్మించింది. దురదృష్టవశాత్తు ఆ పాపకు కండ్లు కనిపించకపోవడంతో బాధపడుతున్నారు. వీటికి తోడు భర్త అస్లాం కొన్ని రోజులుగా అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్నాడు. గురువారం ఉదయం భర్త అస్లాం పేయింటింగ్ పనికి, అత్తమామలు కూలీ పనికి వెళ్లిన సమయంలో నాజీ ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ కిరణ్‌కుమార్, ఎస్సైలు ప్రశాంత్, ఆంజనేయులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలిపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

చందుర్తి(వేములవాడ): వృద్ధురాలిపై లైంగికదాడికి పాల్పడ్డ ప్రబుద్ధుడిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. సీఐ కిరణ్‌కుమార్ వివరాలు.. చందుర్తి మండలం కట్టలింగంపేటకు చెందిన ఆవునూరి తిరుపతి(37) ఈనెల 9న అదే మండలం లింగంపేటకు చెందిన 70 ఏళ్ల వృద్ధురాలిని బెదిరించి ఆటోలో ఎక్కించుకొని లింగంపేట శివారులో లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న తిరుపతిని మర్రిగడ్డ శివారులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

వీఆర్ఏ హఠాన్మరణం

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏగా పనిచేస్తున్న అదే గ్రామానికి చెందిన గుమ్మడి ధర్మపురి (58) గురువారం హఠాన్మరణం చెందినట్లు కార్యాలయం సిబ్బంది తెలిపారు. ఎప్పటిలాగే ఉదయం విధులకు వచ్చిన ధర్మపురి.. పనిచేస్తుండగానే ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వడ్డెర ఓబన్న విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): తొలితరం స్వాతంత్య్ర సమరయోధుడు వడ్డెర ఓబన్న చిరస్మరణీయుడు అని వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సూర దేవరాజు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గురువారం ఓబన్న విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. వారు మాట్లాడుతూ ఓబన్న స్వాతంత్య్ర పోరాటం చూపిన పటిమ స్ఫూర్తిదాయకమన్నారు. హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రమేశ్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లో ఓబన్న విగ్రహాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఖానాపూర్ లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ జనరల్ సెక్రటరీ పిట్ల వెంకటేశ్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు రొడ్డ రామచంద్రం, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులను ఆదుకోవాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: శ్రమదోపిడీకి గురవుతున్న మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి కోరారు. మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా సర్వసభ్య సమావేశాల కరపత్రాలను గురువారం సిరిసిల్లలో ఆవిష్కరించి మాట్లాడారు. 23 ఏళ్లుగా మధ్యాహ్న భోజన కార్మికులు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారని, పెరుగుతున్న నిత్యావసరాలకు అనుగుణంగా ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచడం లేదన్నారు. అప్పులు చేసి విద్యార్థులకు వండి పెడుతున్న కార్మికులను ప్రభుత్వం కనీస వేతనాలు అందించి ఉద్యోగ భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఏఐటీయూసీ, మధ్యాహ్న భోజన కార్మికుల ఆధ్వర్యంలో చేపడుతున్న సమావేశాల్లో కార్మికుల సంక్షేమం కోసం చేపట్టాల్సిన కార్యాచరణను వెల్లడిస్తామన్నారు. నాయకులు చిటికెన సత్తయ్య తదితరులున్నారు.

అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు

- ప్రయాణికులకు తప్పిన ప్రమాదం



ఒరిగిన ఆర్టీసీ బస్సు

కోనరావుపేట(వేములవాడ): సిరిసిల్ల నుంచి నిజామాబాద్ జిల్లా సిరికొండకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పింది. అయితే ప్రయాణికులకు ఎలాంటి గాయాలుకాలేదు. సిరిసిల్ల డిపోకు చెందిన బస్సు సిరికొండకు 31 మంది ప్రయాణికులతో వెళ్తుంది. సిరికొండ శివారులో మైలారం బొడ్డుమామిడి చెరువు వద్ద ఎదురుగా వస్తున్న కారు హఠాత్తుగా కుడిపక్కకు తిరిగింది. అప్రమత్తమైన బస్సు డ్రైవర్ కారు ను తప్పించబోగా అదుపుతప్పి పక్క కాలువలోకి ఒరిగింది. బస్సు పక్కకు ఒరగడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. చిన్నపాటి గాయాలు తప్ప ఎలాంటి ప్రమాదం జరుగక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

పల్లెప్రకృతి వనాల ధ్వంసం కేసులో నలుగురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ జీవన్‌రెడ్డి

ఇల్లందకుంట(హుజూరాబాద్): మండలంలోని సిరిసేడు, భోగంపాడు పల్లెప్రకృతి వనాల ధ్వంసం కేసులో పోలీసులు ఓ ప్రజాప్రతినిధితో పాటు ముగ్గురిని అరెస్ట్ చేశారు. గురువారం హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. మండలంలోని సిరిసేడు గ్రామ రెవెన్యూ పరిధి ఎర్రగుట్టల సమీపంలో సిరిసేడు, భోగంపాడు గ్రామాలకు చెందిన పల్లె ప్రకృతి వనాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని ఈ నెల 7న పంచాయతీ కార్యదర్శులు అంకుస్, శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. సిరిసేడుకు చెందిన రేణికుంట్ల చిన్నరాయుడు, రేణికుంట్ల రామస్వామి పథకం ప్రకారం పల్లెప్రకృతి వనాల్లో చెట్లను తొలగించి, కబ్జా చేసి రామస్వామికి భూమి, కబ్జా కార్యక్రమం చేసినందుకు కొంత మొత్తం డబ్బు చిన్నారాయుడికి ఇచ్చుటకు ఇరువురు ఒప్పందం చేసుకున్నారు. సిరిసేడుకు చెందిన సల్పల రమేశ్‌కు రూ.పదివేలు అడ్వాన్స్ ఇచ్చి జేసీబీని మాట్లాడుకున్నారు. ఆదివారం రాత్రి జేసీబీ డ్రైవర్ శశికుమార్ పల్లెప్రకృతి వనాల్లోని చెట్లను ధ్వంసం చేశాడు. ఈ కేసులో జేసీబీ, కారు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని, నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఏసీపీ వివరించారు. సమావేశంలో జమ్మికుంట రూరల్ సీఐ కిషోర్, ఎస్సై రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

వెల్గటూర్(ధర్మపురి): కుటుంబ సమస్యలతో ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్సపొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. వెల్గటూర్ మండలం జగదేవుపేటకు చెందిన మానుపాటి రవీందర్(31)కు లోకిని సౌందర్యతో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. రవీందర్ కొన్నేళ్లుగా గల్ఫ్ వెళ్లి ఈ మధ్యే వచ్చాడు. అతడి భార్య వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకొని, తన కుటుంబసభ్యులతో రవీందర్ కుటుంబాన్ని వేధింపులకు గురిచేసింది. ఆవేదనకు గురైన రవీందర్ డిసెంబర్ 22న క్రిమిసంహారక మందు తాగగా, జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని పలు ఆస్పత్రుల్లో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు.

రైలు కిందపడి వ్యక్తి బలవన్మరణం



సంపత్ (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య కారణాలతో ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి వివరాల ప్రకారం.. వీణవంక మండలం శ్రీరాములపేట గ్రామానికి చెందిన కోల సంపత్ (28) హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్ (కాంట్రాక్టు) ఉద్యోగి. అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో గురువారం జమ్మికుంట– ఉప్పల్ రైల్వేస్టేషన్ల మధ్య మడిపల్లి గ్రామం కెనాల్ వద్ద గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య నాగమణి, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.







విద్యార్థుల ఇంటిబాట.. బస్సుల్లో కిటకిట

ప్రభుత్వం పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు ఇంటిబాట పట్టారు. హాస్టళ్లలో ఉన్న విద్యార్థులను తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు వచ్చారు. పుస్తకాలు, వస్తువుల బ్యాగులతో విద్యార్థులు, తల్లిదండ్రులు బస్టాండ్‌కు రావడంతో ప్రయాణ ప్రాంగణం కిక్కిరిసింది. రద్దీ ఎక్కువగా ఉండడంతో సీట్ల కోసం కుస్తీపడ్డారు. బస్సుల్లో కిక్కిరిసి వెళ్లారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల